# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

23 5 92
9 30
KAKINADA
KURAVARAM

THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొందియున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి ! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
(P.O. Box 80) Sambhamurthi St.
KAKINADA-533 004

## ప్రకటన

318 క్రైస్తవ కీర్తనలు గల పుస్తకము ఇంకొకటి ఇప్పుడు లభించుచున్నది. దాని ఖరీదు రూ. 10/- లు; పోష్టు ఖర్చులు రూ. 1-50 అదనం. వలయువారు ఈ దిగువ సహోదరుని సంప్రదించండి.

T. PRAKASA RAO
Church Christ - Bible Learning Centre
KOMAROLE - 523 373.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి **12** | మే **1992** | సంచిక **10**


## సంపాదకీయము

### ఒక పురాతన సమస్య

### (An Old Problem)

క్రైస్తవులైన కొందరు ముందు చురుకుగానే యుంటారు గాని రాను రాను వారు వెనుకంజ వేస్తున్నట్లు కనబడతారు. నెమ్మదిగా జారుకొంటారు. క్రైస్తవులయిన వారే క్రైస్తవ్యాన్ని పాటించరు అని వారు నిందవేస్తారు. యిది ఒక పురాతన సమస్యే. "క్రీస్తు చాల మంచివాడు గాని క్రైస్తవులైన మీరు అట్టి వారు కారు" అని ఒక వేదాంతి అన్నాడు.

నిజ క్రైస్తవ్యానికి దాని అనుచరుల జీవితానికి మధ్య వ్యత్యాసముంటే అది ఆందోళనకరమైనదే అయినను క్రైస్తవ్యాన్ని నిరాకరించదగు కారణం మాత్రం కాదు. సంగతులను గ్రహించుకొన్నవాడు నిష్కపటుడైతే దీన్ని కాదనజాలడు. ఇక్కడ మనం రెండు సంగతులను మనసులో ఉంచుకోవాలి.

మొదటిగా, ఎవడైనా క్రైస్తవ్యాన్ని అనుసరించుటలో విఫలుడైతే, మనం దేవుని నిందించనవసరం లేదు. దేవుడు బయలుపరచి యిచ్చిన సత్యంలో దోషం యేమీ లేదు గాని, దాన్ని అనుసరించడానికి ముందుకొచ్చిన వానిలోనే పొరబాటు ఉంటాది. ఎవడైనా వేషధారి వలె నటిస్తే, లేదా ఒకడు వేషధారి యని లోకానికి తెలిస్తే "అట్టిది క్రైస్తవునికి తగదు" అని వారే అంటారు. అంటే నిజానికి వారు క్రీస్తు చేసిన బోధను అభినందిస్తున్నారు. ఆయనను వెంబడిస్తున్నానని చెప్పుకొనేవాని బలహీనతను కూడ అంగీకరిస్తున్నారు. ఏదైనా బలహీనత వలన గాని, అజ్ఞానము వలనగాని మానవులందరు పరిపూర్ణత లోపించిన వారనే చెప్పుకోవాలి. అయితే బుద్ధిపూర్వకంగా వేషధారియైన వానిని బైబిలు ఖండించుచున్నది. ఒకడు భక్తిహీనుడైనందువలన బైబిలు యొక్క ఉన్నత స్థాయి దిగజారిపోదు. గాని అట్టివాడు తేలికగా క్రీస్తు మార్గాన్ని విసర్జించాడని గ్రహించి అట్టివానికి మనం ఓపికతో జ్ఞానోపదేశం చేయడమో బుద్ధి చెప్పడమో జరగాలి (2 తిమో 3:16, 17).

రెండవదిగా, క్రైస్తవజీవితంలో పెరుగుచు వివిధ స్థాయిలలో యున్న మనుష్యులతో మనం పనిచేయుచున్నామని మనసులో యుంచుకోవాలి (1 పేతురు 2:1-2; హెబ్రీ 5:12). చిన్న పిల్లలు నడవడం నేర్చుకొనే టప్పుడు అనేకసార్లు పడుతూ లేస్తూ ఎట్లుంటారో, అట్లే క్రైస్తవులైన కొందరు పడిపోతూ యుంటారుగాని మరికొందరయితే చక్కగా పెరుగుతారు, బలపడ్తారు. పరుగుపందెములో ఛాంపియనులు అనేకులున్నారు. గాని ఆరంభంలోనే వారు ఛాంపియనులై పోలేదు. బలహీనంగా ప్రారంభించి బలవంతులయ్యారు! అలాగే క్రైస్తవ్యంలో, క్రీస్తు సంఘములో బలమైన క్రైస్తవులున్నారు. ప్రారంభంలో వారు కూడ తప్పటడుగులు వేసినా క్రీస్తునందు బలవంతులైనారు.

సద్భావము గలవాడవై నను ఒక వస్తువు తయారయిన తరువాతనే అది మంచిదో చెడ్డదో చెబుతాడు. ఏదైనా పాఠశాలలో ఒకళ్ళిద్దరు మొద్దులుంటే, వారినిగూర్చి ఆ సంస్థ నంతటినీ మనం నిందించనవసరం లేదు. గాని ఆ సంస్థలో యుంటూ ప్రథమ శ్రేణిలో పట్టభద్రులైన వారనేకులను మనం మరచిపోలేము కూడ. పెక్కుమంది ఉత్తీర్ణులైన యెడల అందరు విజయాన్ని సాధించే అవకాశాలు సమానంగా యున్నాయని కొందరయితే ఆసక్తి కలిగి వాటిని వినియోగించుకొని విజయం సాధించగా, మరికొందరు ఉదాసీనతను కనుబరచి శ్రద్ధలేమి వలన విఫలులయ్యారని మనం గ్రహించుకొనగలం. పొరబాటు ఆ సంస్థది కాదు గాని దానిలో ప్రవేశించిన వారిదేగదా.

క్రైస్తవ్యం వలన, క్రీస్తు సంఘము వలన ఈ లోకం ఇంకా నివాసయోగ్యంగా యున్నది. అందరూ క్రైస్తవులై క్రైస్తవ జీవితాన్ని జీవిస్తే యిది మరింత శ్రేష్టమైన స్థలం కాగలదు. క్రీస్తులో యుండి మనం ప్రయత్నిస్తే విజయం సాధించగలం. ఆయనకు వేరుగా యుండి మనం యేమీ చేయలేము.

## "వారు ఎడతెగక యుండిరి"

## (They Continued Steadfastly)

(అపొ. కా. 2 : 42)

క్రీ॥ శ॥ 33 సం॥ లో యెరూషలేములో సంఘము స్థాపించబడిన తరువాత దీనిని గూర్చి పరిశుద్ధాత్ముడు మొట్టమొదటిగా పలికిన ఈ మాటలు గమనించుము. "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి" (అ.కా. 2 : 42). ఈ లేఖనములో గల 'వీరు' అను

మాట బాప్తిస్మము పొందినవారిని సూచించుచున్నది. కావున బాప్తిస్మము పొందినవారు ఎడతెగక నిలకడగా యుండవలసిన అవసరము గలదని ఈ వాక్యముయొక్క అర్థము. క్రైస్తవులనేకులు నిలకడగా నుండరు. వారు తమ పరుగును బాగుగానే ఆరంభింతురు, దానిని కొంత కాలము కొనసాగింతురు, పిమ్మట పందెమునుండి తొలగిపోవుదురు (గలతి 5:5). పరలోకమునకు చేరుకొనవలెనని మనము దేవుని వాక్యములో ఎడతెగక నిలకడగా నుండవలెను. ఈ ప్రయాణములో నిలచిపోవుటకు తావులేదు. సరియైన బోధయందు నిలకడగా నుండవలెను. అనగా అపొస్తలుల బోధయందు నిలకడగా నుండవలెను. క్రొత్త నిబంధనలో అపొస్తలుల బోధను గూర్చి చదువగలము. ఒకవేళ మనము మానవ సిద్ధాంతములు, ఆజ్ఞలందు నిలకడగానున్నచో అది వ్యర్థమే. "ఏలయనగా మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15 : 9). మానవ సిద్ధాంతములు మానవుని రక్షింపలేవు. అయితే ఈ లేఖనమునందు గల సహోదరులు పూర్తి సహవాసమందు ఉండిరి. గనుక నేటి క్రైస్తవులు లేదా క్రీస్తు సంఘములు ఆదిమ సంఘముయొక్క బోధయందు నిలకడగా నుండవలెను. అయితే ఆదిమసంఘము నిలకడగానున్న అంశము లేవి! ఈ క్రింది సంగతులను గూర్చి యోచింతము.

## రొట్టె విరుచుటయందు నిలకడగా నుండిరి

దైవికమైన ఆటంకము కలిగితే తప్ప విశ్వాసులైన క్రైస్తవులు ఎన్నడును ప్రభువు రొట్టెలో పాలుపంచుకొనకుండ యుండరు. ఈ పరిశుద్ధమైన విందులో పాల్గొను వారందరిని ప్రభువు దృష్టించును (అ.కా. 20 : 7). ప్రభురాత్రి భోజనము ఏదినమున తీసుకొనవలెను?

సంవత్సరమునకు ఒకసారి లేదా నెలకు ఒకసారి చొప్పున ఈ ఆజ్ఞను ఆచరింపరాదు. కేవలము ఆదివారమున మాత్రమే ఈ విందులో పాల్గొనవలయును. రొట్టె ద్రాక్షారసములు ఆయన శరీర రక్తములకు గుర్తుగా యున్నవని గ్రహించవలెను. కావున ప్రతి క్రైస్తవుడు ఈ విందులో తప్పక పాల్గొనవలెను.

## దేవునియందు భయభక్తులు గలవారు

లేఖనమిట్లు చెప్పుచున్నది. "అప్పుడు ప్రతి వానికి భయము కలిగెను" (అ. కా. 2 : 43). నేడు మనుష్యులలో దేవుని గూర్చిన భయము లోపించుచున్నది. పేతురు నేర్చుకొనిన పాఠమును ఈ సమయమందు మనమును గ్రహింపవలసి యున్నది. అప్పుడుమాత్రమే మనము అట్లు చెప్పగలము. పేతురు మాటలు గమనించుము. "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను". ప్రతి జనము లోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును. (అ.కా. 10:34, 35). దేవునికి భయపడక నీతిగా నుండకుండు వానిని ఆయన అంగీకరింపడు. కావున మన జీవితాంతము ఊరక నే యుండక దేవునికి భయపడుచు నీతిగా నడుచుకొనుచు ఉందుముగాక. సొదొమ, గొమొఱ్ఱా అను ప్రదేశములందు దేవుని భయము బొత్తిగా లేనందున వారు దేవుని ఉగ్రతకు పాత్రులైరి (ఆది.కా. 19 అధ్యా). నోవహు కాలపు జనులుకూడ నిర్దయులై దేవునికి దూరమైపోయిరి. జ్ఞానియైన సొలొమోను మాటలు గమనించుము. "ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థ మిదే; దేవునియందు భయభక్తులు కలిగి యుండి ఆయన కట్టడలను అనుసరించి నడుచుచుండవలెను. మానవ కోటికి ఇదియే విధి" (ప్రసంగి 12 : 13).

## ఆదిమ సంఘస్థులు ఏకముగా నుండిరి

"విశ్వసించిన వారందరు ఏకముగా నుండిరి" (అ.కా. 2 : 44). ఏకముగా నుండకపోవుటకంటే సంఘాభివృద్ధికి ఆటంకముగా నుండిన దేమి లేదు. సహోదరులలో ఐక్యత లోపించుట సాతాను విజయమున కు గురుగా నున్నది. యేసుక్రీస్తు ఈ అనైక్యతను గూర్చి ముందుగా ఎరిగినవాడై యుండి మనందరికొరకిట్లు ప్రార్థించెను. "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వీరును మనయందు ఏకముగా ఉండవలెనని వారికొరకు మాత్రము ప్రార్థించుటలేదు; వారి వాక్యము వలన నీయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17 : 20, 21). యేసుక్రీస్తు తన శిష్యుల కొరకు మాత్రమే గాక తదుపరి వచ్చు మనుష్యులందరి కొరకును ప్రార్థించెను. అపొస్తలుల వాక్యముద్వారా ఆయనను అంగీకరించు వారందరి నిమిత్తము ప్రార్థించినాడు. కావున రక్షింపబడగోరువారు అపొస్తలుల బోధయందు నిలిచియుండవలెను. మానవుల సిద్ధాంతములను హత్తుకొనుట ద్వారా ఎవరును రక్షింపబడరు. శిష్యులలో ఇట్టి ఏకత్వము లోపించినచో అనేకులు నరకమునకు పాత్రులగుదురని యేసు ముందుగా ఎరిగిన వాడాయెను. మనలో గల విభేదములు లేని అసంతృప్తికి లోనగునట్లు చేయును. విభేదములతో కూడిన క్రైస్తవ్యము అవిశ్వాసులుగా నుండుటకంటే ఏమాత్రమును తక్కువ గాదు. విభజనలు తప్ప నిజమైన సంఘముయొక్క అభివృద్ధిని నిరోధించున దేదియును లేదు. ఈ లోకము క్రైస్తవ్యములో గల విభజనలను చూచినచో వీరు మనలను నిజక్రైస్తవులుగా అంగీకరింపరు. గనుక ఆదిమ సంఘములో గల ఏకత్వము నేడు ప్రతి స్థానిక సంఘమునకు అత్యవసరమని భావము.

అపొస్తలుడైన పౌలు ఎఫెసీయులకిట్లు వ్రాసెను, "కాబట్టి మీరు సమాధానమను బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగినవారై యుండుడి" (ఎఫెసీ 4:1, 3). ఆత్మ బోధించిన వాక్యమును అంగీకరించిన యెడల ఆ ఆత్మ వాంఛించిన ఐక్యమును మనము సాధింపగలము. "సహోదరులు ఐక్యత కలిగియుండుట ఎంతమేలు, ఎంత మనోహరము" (కీర్తనలు 133:1). మంచి విషయము లనేకము లుండవచ్చును. గాని అవి అన్నియు మనోహరమైనవి కావు. అయితే సహోదరులలో గల ఐక్యత మేలైనది, మనోహరమైనది. స్థానిక సంఘము ఐక్యతగా నుండుట ద్వారా మనోహరముగా నుండగలదు.

## ఆదిమ సంఘస్తులు దాతృత్వమును కలిగివారు

"విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగిన దంతయు సమిష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వీరు తమ చరస్థిరాస్థులను అమ్మి, అందరికిని వారివారి అక్కరకొలది పంచిపెట్టిరి" (అ.కా. 2 : 44, 45). భూములైనను ఇండ్లయినను కలిగిన వారందరు వీటిని అమ్మి, అమ్మిన వాటి వెలతెచ్చి అపొస్తలుల పాదముల యొద్ద పెట్టుచు వచ్చిరి. ప్రతి వానికి వానివాని అక్కరకొలది పంచిపెట్టిరి గనుక వారిలో ఎవ నికి కొదువలేకపోయెను (అ.కా. 4 : 34, 35). యూదయ ప్రాంతము లలో కరవు సంభవించినదని అంతియొకయలోని శిష్యులు వినినప్పుడు వారికి కొంత సహాయము చేయ నిశ్చయించిరి. "అప్పుడు శిష్యులలో ప్రతివాడును తన శక్తి కొలది యూదయలో కాపురమున్న సహో దరులకు సహాయము పంపుటకు నిశ్చయించుకొనెను. ఆలాగున చేసి బర్నబా, సౌలు అను వారిచేత పెద్దలయొద్దకు దానిని పంపిరి" (అ.కా. 11:29, 30). నేడు అనేకులుఇట్టి పరిస్థితులను గూర్చి మాట లాడుదురు గాని చాలా తక్కువగా సహాయ పడుటకు ముందుకు వచ్చెదరు. సహాయము సంఘ పెద్దలద్వారా చేయబడుట మంచిదే.

ఈ పై వాక్యములను బట్టి ఆదిమ సంఘస్థులు దాతృత్వము గలవారని తెలియుచున్నది. క్రైస్తవులు 'ఇచ్చుటలో' ముందంజ వేయుట ద్వారా సువార్త ప్రకటనకు బహుగా సహాయపడగలరు. సువార్త ప్రకటన, అనాథలను ఆదుకొనుట, స్థానిక సంఘము యొక్క ముఖ్య విధులై యున్నవి. "పుచ్చుకొనుట కంటె ఇచ్చుట" ధన్యమని దైవ గ్రంథం బోధించుచున్నది. ఇచ్చుటలో గొప్ప దీవెన గలదని క్రైస్తవులు నేర్చుకొనవలెను. పౌలుయొక్క సువార్త పరిచర్యలో ఫిలిప్పీ సంఘస్థులు మిక్కిలి సహాయపడినట్లుగా వ్రాయబడి యున్నది. పౌలు థెస్సలొనీకలో పరిచర్య చేసినప్పుడు కూడ వీరు అతనికి సహాయపడిరి (ఫిలిప్పీ 4 : 16, 17). అయినను ప్రతి క్రైస్తవుడు శక్తికి మించినది కాదుగాని శక్తికొలదియే యిచ్చినది ప్రీతికరమగును (II కొరింథీ 8 : 12). "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును. సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును అని యీ విషయమై చెప్పవచ్చును. సణుగుకొనకయు బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (II కొరింథీ 9:6, 7).

## ప్రభువు పనిలో ఆనందముగా నుండిరి

"ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి" (అ.కా. 2:47). ఈ లేఖనమును బట్టి క్రైస్తవులు మాత్రమే ఈ భూమిపై మిక్కిలి ఆనందముగా నుండు జనులని అర్థమగుచున్నది. వారి పాపములనుండి విమోచింపబడి దేవునికి పిల్లలుగా నుండిరి. గనుకనే వీరు ఆనందముగా నుందురు. యేసుక్రీస్తు ద్వారా మనము దేవుని వారసులము. అంతేగాక మనము క్రీస్తుతో

వారసులము గనుక ఈ భూమిపై గల దేవుని ప్రజలమై యున్నాము. అత్యానంద భరితమైన మరియొక స్థలము మనకు గలదు. సణుగుట సంశయములు గలవారికి అందు పాలు లేదు. కావున మనము ఏ స్థితిలో యున్నను ఆ స్థితియందు సంతృప్తి కలిగి యుండుటకు నేర్చు కొనవలెను. "నేను ఏ స్థితిలో యున్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగి యుంఢ నేర్చుకొని యున్నాను" (ఫిలిప్పీ 4 : 11). పౌలువలె నేడు నీవు ఈ మాటలను చెప్పగలవా? ప్రతి క్రైస్తవుడు అట్టి స్థితిని అల వరచుకొనుటకు యెదుగవలసియున్నది. ఇదే పత్రికలో పౌలు మాట లను గమనించుడి: "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి. మరల చెప్పుదును ఆనందించుడి" (ఫిలిప్పీ 4 : 4). కావున క్రైస్తవుడుగాని, స్థానిక సంఘముగాని ప్రభువు పనిలో ఆనందముగాను, ఉత్సాహాము గాను పాల్గొనవలెను. మనము దుఃఖముఖులముగా ఆయన పనిచేయుట ప్రభువునకు యిష్టములేదు. కావున సంఘమును పరిపాలన చేయు సంఘ పెద్దలను గూర్చి పేతురు ఇట్లు చెప్పుచున్నాడు: "బలిమిచేత కాక దేవుని చిత్తప్రకారము ఇష్టపూర్వకముగాను దుర్లాభాపేక్షతో కాక సిద్ధమనస్సుతోను, మీ మధ్య దేవుని మందను పై విచారణ చేయుచు దానిని కాయుడి" (1 పేతురు 5:2).

## ఆదిమ సంఘస్తులు ప్రార్థనయందు నిలకడగా నుండిరి

దేవునితో మాటలాడుటకు క్రైస్తవునికి గల ఏకైక మార్గము ప్రార్థనయై యున్నది. దేవుని కుమారుడు బయలు పరచితేనే గాని ప్రార్థించుట ఎట్లో మనకు తెలియదు. క్రీస్తు అపొస్తలులకు ప్రార్థిం చుట నేర్పెను. ఆదిమ సంఘస్థులు అపొస్తలుల బోధ సహవాసము రొట్టె విరచుటయు, ప్రార్థించుటయందు ఎడతెగక యుండిరి. ఆదిమ సంఘమువలె నేడు స్థానిక సంఘములు ప్రార్థించుటలో నిలకడగా నుండవలెను. యేసుక్రీస్తు అనేక పర్యాయములు ప్రార్థించినట్లు

సువార్తలలో గలదు. ఆదిమ సంఘము క్రైస్తవులు ప్రార్థనయందు నిలకడగా నుండిరని చదివితిమి. ఆదిమ సంఘము శ్రమలో నున్నప్పుడు వారు ఏక మనస్సుతో దేవుని ప్రార్థించినట్లు చూడగలము (అ.కా. 4 : 24). చెరసాలలో నున్న పౌలు, సీలలు అర్ధరాత్రివేళ ప్రార్థించుచు కీర్తనలు పాడిరి. గనుక ఆదిమ సంఘమువలె నేడును స్థానిక సంఘములు కూడ శ్రమలలోను, ఆపదలలోను దేవునికి ప్రార్థించవలసి యున్నది. "యెడతెగక ప్రార్థన చేయుడి" (1 థెస్స 5 : 17). మనము ఎప్పుడు ఎట్లు ప్రార్థించవలెను? "విసుగక నిత్యము ప్రార్థన చేయుడి" (లూకా 18 : 1). "ఆత్మవలన ప్రతి సమయమందును ప్రతివిధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి" (ఎఫెసీ 6 : 18). దీనిని బట్టి మీరు పరిశుద్ధులు అనగా క్రైస్తవుల కొరకు పట్టుదలతో ప్రార్థింపవలెను. అపొస్తలుడైన పౌలు కొలస్స సంఘ క్రైస్తవుల నుద్దేశించి వ్రాసిన మాటలు గమనించుము. "ప్రార్థనయందు నిలకడగా నుండి కృతజ్ఞత గలవారై దీనియందు మెలకువగా ఉండుడి" (కొలస్స 4:2, 1 పేతురు 4 : 7). "దేనిని గూర్చియు చింతింపకుడి కాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞత పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" (ఫిలిప్పీ 4:6). కావున ఈ లేఖనము లన్నిటిని బట్టి ప్రార్థించుట ఎంత ప్రాముఖ్యమైనదో మనకు తెలియుచున్నది.

ఇంతవరకు మనము ఆదిమ సంఘస్థులు వేటియందు నిలకడగా నుండిరో వాటిని తెలుసుకొని యుంటిమి. వారు రొట్టె విరుచుట యందు నిలకడగా నుండిరి. వారు దేవునికి భయపడువారు. ఆదిమ క్రైస్తవులు దాతృత్వము గలవారు. ఐక్యత గలవారు. ప్రభువు పనిలో వీరు ఆనందముగా పాలు పొందిరి. నిస్వార్థముగా ప్రయాస

పకిరి. ఆఖరుగా ఆదిమ సంఘము ప్రార్థించే సంఘమని కూడ నేర్చుకుంటిమి. మనకు లేదా స్థానిక సంఘమునకు పై లక్షణములు లోపించినచో అట్టివి లేఖనమునుండి దూరమగుచున్నదని గ్రహింపుము. వాక్యము ప్రామాణికముగా చేసుకొని క్రీస్తు అడుగుజాడలలో ముందుకు నడుచుచు మన ముందుగల పందెములో ఓపికతో పరుగెత్తుదుము గాక !

—బి. విజయకుమార్,
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

---

## దేవుడు నీళ్ళకిచ్చిన విశిష్టత
## ( Where God Put Water )

దేవుడు సృజించిన సృష్టి యంతటిలో నీరు ప్రముఖ పాత్ర వహించుచున్నది. వర్షం, మంచు, సముద్రములు, సరస్సులు, నదులు మొదలగువాటి ఆవిర్భావమునకు ఈ నీరే మూలం. ఈ ప్రపంచము లోని జీవరాసు లన్నిటికి నీరు చాల అవసరమయి యున్నది.

దేవుడు సృష్టిని చేయనారంభించు సమయాన ఆయన "ఆత్మ జలములపై అల్లాడుచుండెను" (ఆది 1:2). మానవుని యొక్క నాగరికత సంస్కారాల అభివృద్ధి నీళ్ళయొక్క పరిమాణాన్ని బట్టి అది దొరకు విధానాలను బట్టి ఏర్పడుతూ వచ్చెను.

దేవుడు ఈ నీటిని అనేక సందర్భాలలో అనేక రీతులుగా మానవుని ఉపయోగార్థం వినియోగించుకొనుటకు నియమించెను.

## చావు – బ్రతుకుల మధ్య నీరు

మనిషికి, జంతువులకు, చెట్లకు సమస్త జీవరాసులకు నీరు అవసరం. కొన్ని తరగతుల జీవరాసులు నీరు లేనిచోటున కూడ బ్రతుకగలవు గాని ఏదో ఒక విధముగ కొంత తేమ లేకుండా బ్రతకలేవు. నీరు లేకపోతే మనిషి చనిపోతాడు. దాహంతో కృషించిపోతాడు.

నీళ్ళవసరం లేకుండ మనిషి బ్రతికేలాగ దేవుడు మనిషిని చేయలేడా? చేయగలడు. అయితే ఆయన అలా చేయలేదు. దేవుడు అలా ఎందుకు చేసాడో నాకు తెలియదు. మనిషి ఏదో ఒక రూపములో నీరు త్రాగితేనే బ్రతుకగలడు. ఈ విధముగా దేవుడు మానవుల చావుబ్రతుకుల మధ్య నీళ్ళను ఉంచాడు.

ఇదే పద్ధతిని దేవుడు మొక్కలకు చెట్లకు పెట్టెను. ప్రపంచములో ఎక్కడా లేని యిసుక ఎడారులలో దొరుకుతుంది. అయితే నీళ్ళులేని కారణం చేత అక్కడ ఏ మొక్క మొలవదు. అలా దేవుడు ఎందుకు చేసాడు? నాకు తెలియదు. ఆయన అలా చేసాడు అంతే.

## తృష్ణ - తృప్తిల మధ్య నీరు

రోజులో చాలసార్లు మనిషి దాహంగొని యుంటాడు. దాహం కలిగియుండుట అంటే ఆ శరీరం తనకు నీరు అవసరం అని చెప్పడం అన్న మాట. ఒక వ్యక్తి ఏ రసమో, తేనీరో లేక మరేదో యొకటి త్రాగవచ్చును గాని, సాధారణముగా చాలినంత నీరు త్రాగకపోతే అతని దాహం తీరదు. శరీరమునకు నీరు ($H_2O$)ఎంతైనా అవసరము.

ఇలా ఎందుకు చేసాడు దేవుడు? నాకు తెలియదు. దేవుడు ఉన్నాడు అని తెలుసుకోనేముందు మనిషి తృప్తి తృష్ణలమధ్య నీరు అనేది ఒకటి ఉన్నదని గ్రహించాలి.

## మురికి - శుభ్రముల మధ్య నీరు

మురికిని తొలగించుకొనుటకు నీరు ప్రపంచమంతటిలో ప్రధానమైనది. పాత్రలు, బట్టలు, మన శరీరములను శుభ్రపరచుకొనుటకు యింకా అనేక రీతుల మురికి వదిలించుకొనే విషయాలలో ఈ నీరు ఉపయోగపడుచున్నది. ఇది పాత నిబంధన కాలములో భౌతిక శుభ్రతకు మరియు కొన్ని ప్రత్యేక సందర్భాలలో శుభ్రపరచబడుటకు వినియోగించెడివారు.

## పాపము - జీవముల మధ్య నీరు

బైబిలులోని మొదటి పేజీలలో మానవుడు దేవుని కృపనుండి ఎట్లు తొలగిపోయాడో తర్వాత ఎలా పతనమైపోయాడో వివరంగా చదువగలము. మానవుని ప్రతి ఆలోచన, తలంపులు, ఊహాలు అన్ని ఎప్పటికప్పుడు దేవుని ఎదుట క్రూరంగా కనబడుతూ వచ్చాయి. అందుకే దేవుడు "తాను భూమిమీద నరులను చేసినందుకు సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను" (ఆది 6:1-7).

అయితే నోవహు అనే వ్యక్తి దేవుని కృపకు పాత్రుడుగా ఉండుటచేత, దేవుడు అతనిని అతని యింటివారిని రక్షించుకొనుటకు ఒక ఓడను తయారుచేసుకొనుమని ఆజ్ఞాపించెను. ఆఖరుకు జలప్రళయం సంభవించెను. "నరులతో కూడ పశువులును పురుగులును ఆకాశ పక్షులును నేలమీదనున్న జీవరాసులన్నియు తుడిచివేయబడెను. నోవహును అతనితో కూడ ఆ ఓడలో నున్నవియు మాత్రము మిగిలియుండెను" (ఆది 7:23).

ఆ నీటినుండి ఓడద్వారా నోవహును అతని యింటి వారిని దేవుడు రక్షించెను. ఆయన ఆ క్రూరమైన పాపపు మనుష్యుల మధ్య

నుండి నీళ్ళఆధారముగ వారిని రక్షించెను. అపొస్తలుడైన పేతురు ఈ విధముగ వ్రాసెను. "ఆ నీళ్ళవలన అప్పుడున్న లోకము నీటి వరదలో మునిగి నశించెను" (II పేతురు 3:6). ఈ విధముగ నోవహు కాలములో దేవుడు పాపము జీవములమధ్య నీళ్ళను ప్రవేశపెట్టెను.

## బానిసత్వము - విమోచనలమధ్య నీరు

మోషే ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వమునుండి విడుదల చేయు సందర్భములో దేవుడు ఎర్ర సముద్రపు నీళ్ళను రెండు పాయలుగా చేసి ఆరిన నేలమధ్య వారిని నడిపించెను.

ఫరో సేనలు వారిని వెంబడించి వెంటాడినపుడు దేవుడు వారిని నాశనము చేయుటకు నీళ్ళకు ఆజ్ఞ నీయగా వారంతా ఆ సముద్రములో నశించిపోయిరి. "ఆ దినమున యెహోవా ఐగుప్తీయుల చేతిలో నుండి ఇశ్రాయేలీయులను రక్షించెను. ఇశ్రాయేలీయులు చచ్చిన ఐగుప్తీయులను సముద్రతీరమున చూచిరి" (నిర్గమ 14:30). ఈ విధమున దేవుడు మోషేకాలములో నీళ్ళను బానిసత్వము విడుదలకు మధ్య నుంచెను. వారందరు సముద్రములో బాప్తిస్మము పొందిరని పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథి 10:2).

## పాపము - పవిత్రతల మధ్య నీరు

దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి విడుదలచేయునపుడు ఆయన వారికి ఆరాధన కొరకు ఒక ప్రత్యక్షపు గుడారమును ఉంచెను. సొలోమోను దేవాలయము కట్టేవరకు ఇది సంచార గుడారముగా నుండెడిది.

ఈ ప్రత్యక్ష గుడారము యొక్క అతి పరిశుద్ధ స్థలములోనికి వెళ్ళేముందు యాజకులు నీళ్ళతో స్నానముచేసి పవిత్రపరచబడవలయును. అప్పుడే వారు ఇశ్రాయేలీయులయొక్క ఆత్మీయ అవసరత

లను గూర్చి సేవచేయుటకు అర్హులగుదురు. ఆ కాలములలో దేవుడు మోషేద్వారా ఇటువంటి నీళ్ళతో పవిత్రపరచబడమునే కోరు కొనెను. ఈ విధంగా దేవుడు ఎందుకు కోరుకొనియున్నాడో మనకు తెలియదు. అయితే దేవుడు వారిని కోరుకొనెను. ఇందులో అనుమాన మేమియు లేదు. పాతనిబంధనలో దేవుడు పాపము పవిత్రతల మధ్య నీళ్ళను ఉంచెను.

## రోగము - స్వస్థతలమధ్య నీరు

సిరియా సైన్యాధిపతియైన నయమాను ధైర్యశాలి మంచి వీరత్వము గలవాడు. అయితే అతడు కుష్ఠురోగి. ఎలీషా ప్రవక్త అతనితో "నీవు యొర్దాను నదికి పోయి యేడు మారులు స్నానము చేయుము, నీ ఒళ్ళు మరల బాగై నీవు శుద్ధుడవగుదువని" చెప్పెను (II రాజులు 5:10). మొదట నయమాను అట్లు చేయుట కిష్టపడలేదు. అయితే అతని సేవకులలో విధేయుడైన తెలివిగల దాసుడు ఇట్లనెను: "నాయనా, ఆ ప్రవక్త యేదైన నొక గొప్ప కార్యము చేయుమని నియమించినయెడల నీవు చేయకుందువా? అయితే స్నానము చేసి శుద్ధుడవు కమ్మను మాట దానికంటె మేలుకాదా" అని చెప్పెను (II రాజులు 5:13).

అప్పుడు నయమాను దేవుని ఆజ్ఞకు లోబడి విధేయుడై "అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడు మారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను" (II రాజులు 5:14).

అయితే అతడు ఆ నీళ్ళవలన మాత్రమే శుద్ధుడాయెననా దాని అర్థము? అట్లు కాదు. దేవుడే అతని స్వస్థపరచెను. అటువంటప్పుడు అతడు నీళ్ళలో మునగడం ఎందుకు? ఎందుచేతనంటే దైవ ప్రవక్త

అట్లు చేయుమని చెప్పెను. అనగా అతని విధేయతే అతనిని స్వస్థపరచెనా? అట్లుకాదు, ఇదంతయు ఒక అద్భుతమైన దేవుని వరమే. నయమాను దినములలో దేవుడు నీళ్ళను రోగము స్వస్థతల మధ్య నుంచెను.

## గుడ్డితనము — చూపుల మధ్య నీరు

ఒకసారి యేసుక్రీస్తు ఒక పుట్టుగ్రుడ్డివానిని కనుగొనెను. అతని మీద జాలిపడి, నేలపై ఉమ్మి వేసి బురదచేసి అతని కనులమీదపూసి యిట్లనెను: "నీవు సిలోయము అను కోనేటికి వెళ్ళి అందులో కడుగు కొనుమని చెప్పెను......వాడు వెళ్ళి కడుగుకొని చూపుగలవాడై వచ్చెను" (యోహాను 9:7).

అతనికి చూపు ఏది యిచ్చెను? దేవుడా? క్రీస్తా? విశ్వాసమా? విధేయతా? లేక నీళ్ళా? వీరందరూ యిందులో మిళితమై యున్నారు. ఒక్క నీళ్ళలో మాత్రమే శక్తి లేదు. ఇది నిజం. అయితే సిలోయము అను కోనేరు క్రీస్తు ఆజ్ఞలోని ఒక సూచనయై యున్నది. అప్పుడతడు అందులో కడుగుకొనగ చూపు పొందెను. ఈతని విషయములోకూడ దేవుడు గుడ్డితనమునకు చూపుపొందుటకు మధ్య నీళ్ళనుంచెను.

## పాపము – రక్షణల మధ్య నీరు

క్రీస్తు దేవుని యొద్దకు ఆరోహణ మవుటకు ముందు శిష్యులతో "పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్య బడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను." (మత్తయి 28:18-20).

ఈ బాప్తిస్మమును, క్రీస్తు తనకు గల సర్వాధికారముతో ఆజ్ఞాపించెను. అది సమాధితో సమానము (రోమా 6:3-6) నీళ్ళలోనికి బాప్తిస్మము పొందాలి (అ. కార్యా. 8:36-38); పాపక్షమాపణ నిమిత్తము (అ.కార్య. 2:38), పాపములను కడుగుకొనుటకు (అ.కార్య. 22:16) ఒక్క క్రీస్తు శరీరములోనికి (1 కొరింథి 12:13); క్రీస్తును ధరించుకొనియుండుటకు (గలతి 3:26-29). పైన చెప్పబడిన దంతయు క్రీస్తు చెప్పిన గొప్ప ఆజ్ఞలో ఒక భాగము. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15,16). అంతేకాక బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపింపబడెను (అ.కార్య. 10:48).

పెంతెకోస్తు దినాన ప్రజలు బాప్తిస్మము పొందకుండ రక్షింపబడలేదు. అపొస్తలుడైన పేతురు హెచ్చరించి "మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని" చెప్పెను (అ.కార్య. 2:38).

వీరంతా నీళ్ళలోనుండే రక్షింపబడిరి. ఇప్పుడు కూడా నీరే మన రక్షణ విషయములో ప్రధానపాత్ర వహించుచున్నది. అందుకనే పేతురు "నోవహు దినములలో...ఆ ఓడలో కొందరు అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణ పొందిరి; దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" అని చెప్పెను పేతురు 3:20-21).

కాబట్టి ఈ దినములలో అనగా క్రీస్తు రాకడ సమయము వరకు దేవుడు పాపము రక్షణలకు మధ్య నీళ్ళ నుంచెను. ఇది సత్యం.

—ఓవెన్ కాస్‌గ్రోవ్.

# తరచూ అడిగే పది మతసంబంధమైన ప్రశ్నలు

## (Ten Religious Questions Most Frequently Asked)

—గయ్.వి. కేస్సీ.

( గత సంచిక తరువాయి )

### 6. రక్షింపబడుటకు నేను సంఘ సభ్యునిగా నుండవలసి యున్నదా ?

"ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" (అ.కా. 2:47).

"మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆసంఘము ఆయన శరీరము. సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెస్సీ 1:22, 23).

"సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు, ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" (కొలస్స 1:18).

"ఏలాగనగా యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను...మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథి 12:13).

"క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23).

## 7. ఏ సంఘములో నేను సభ్యుడుగా ఉండాలి?

"యెహోవా ఇల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే. యెహోవా పట్టణమును కాపాడని యెడల దాని కావలి కాయువారు మేలుకొనియుండుట వ్యర్థమే" (కీర్త 127:1).

"దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్నది" (1 తిమో 3:15).

"ఏలాగు శరీరము ఏకమై యున్నను అనేకమైన అవయవములు కలిగి యున్నదో, యేలాగు శరీరముయొక్క అవయవము లన్నియు అనేకములై యున్నను ఒక్క శరీరమై యున్నవో, అలాగే క్రీస్తు ఉన్నాడు" (1 కొరిం 12:12).

"మరియు నీవు పేతురువు. ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను" (మత్త 16:18).

"మరి ఎవని వలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద, మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను" (అ. కా. 4 : 12).

"వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు ఈ పునాది యేసుక్రీస్తే" (1 కొరింథీ 3 : 11).

"ఆయన పరలోకమందున్న నాతండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును" (మత్త 15 : 13) అని చెప్పెను.

## 8. ఒక మానవుడు ఒకసారి రక్షింపబడిన తరువాత తిరిగి పడిపోగలడా?

"తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" (1 కొరింథీ 10:12).

"సర్పము తన కుయుక్తి చేత హవ్వను మోసపరచినట్లు మీ మనస్సులును చెరుపబడి, క్రీస్తు యెడల నున్న సరళతనుండియు పవిత్రత నుండియు ఎట్లయినను తొలగిపోవునేమో అని భయపడుచున్నాను" (II కొరింథీ 11 : 3).

"నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును. ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును. నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నాయందు నిలిచియుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనేగాని తనంతట తానే యేలాగు ఫలింపదో, అలాగే నాయందు నిలిచియుంటేనేకాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగెవలె బయట పారవేయబడి, యెండిపోవును. మనుష్యులు అట్టి వాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు. అవి కాలిపోవును" (యోహా 15:2-6).

"అప్పటినుండి ఆయన శిష్యులలో అనేకులు వెనుకతీసి మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు" (యోహా 6:66).

"మనుష్య కుమారుడు తన దూతలను పంపును. వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతిపరు

లను సమకూర్చి అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయును ఉండును" (మత్త 13:41, 42).

"ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి దానిని లోపరచుకొను చున్నాను" (1 కొరింథీ 9:27).

"ఒకసారి వెలిగింపబడి, పరలోక సంబంధమైన వరమును రుచి చూచి, పరిశుద్ధాత్మలో పాలివారై దేవుని దివ్యవాక్యమును రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన తరువాత తప్పిపోయినవారు తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువ వేయుచు బాహాటముగా ఆయనను అవమానపరచుచున్నారు. గనుక మారుమనస్సు పొందునట్లు అట్టి వారిని మరల నూతన పరచుట అసాధ్యము" (హెబ్రీ 6:4-6).

"ఇవి ఎవనికి లేకపోవునో వాడు తన పూర్వ పాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయి గ్రుడ్డివాడును దూరదృష్టి లేనివాడు నగును. అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్త పడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు" (2 పేతు 1 : 9, 10).

"మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులమని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరుచేయబడి యున్నారు. కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతి 5:4).

"వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవ జ్ఞానముచేత ఈ లోక మాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటిచేత జయింపబడిన యెడల,

వారి కడవరస్థితి మొదటి స్థితికంటె మరి చెడ్డదగును. వారు నీతిమార్గ మును అనుభవ పూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుటకంటె ఆ మార్గము అనుభవ పూర్వకముగా తెలియక యుండుటయే వారికి మేలు. కుక్క తన వాంతికి తిరిగి నట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్ళి నట్టును అను నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను" (2 పేతు 2:20-22).

"నీవు వెచ్చగానైనను చల్లగానైనను ఉండక, నులివెచ్చగా ఉన్నావు గనుక నేను నిన్ను నానోట నుండి ఉమ్మివేయ నుద్దేశించు చున్నాను" (ప్రక 3 : 16).

## 9. పాపములనుండి ఎప్పుడు నేను రక్షింపబడాలి ?

"అనుకూల సమయమందు నీ మొర ఆలకించితిని రక్షణ దిన మందు నిన్ను ఆదుకొంటిని అని ఆయన చెప్పుచున్నాడు గదా! ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (II కొరింథీ 6 : 2).

"దుర్దినములు రాకముందే - ఇప్పుడు వీటియందు నాకు సంతో షము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే, తేజస్సునకును, సూర్య చంద్ర నక్షత్రములకును చీకటి కమ్మకముందే...నీ బాల్య దినములయందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" (ప్రసంగి 12 : 1).

"మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి అప్పుడ వన్నియు మీ కనుగ్రహింపబడును" (మత్త 6 : 33).

"యెహోవా మీకు దొరుకు కాలమునందు ఆయనను వెదకుడి

ఆయన సమీపములో ఉండగా ఆయనను వేడుకొనుడి. భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను. వారు యెహోవావైపు తిరిగిన యెడల ఆయన వారియందు జాలిపడును. వారు మన దేవునివైపు తిరిగినయెడల ఆయన బహుగా క్షమించును" (యెష 55:6, 7).

## 10. మరొక దినం కొరకు ఎందుకు ఎదురుచూడకూడదు ?

"రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవమే పాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరి వంటివారే" (యాకో 4:14).

"పగలున్నంత వరకు నన్ను పంపినవాని క్రియలు మనము చేయుచుండవలెను. రాత్రి వచ్చుచున్నది. అప్పుడెవడును పని చేయలేడు" (యోహా 9:4).

"మీరనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును. గనుక నే మీరును సిద్ధముగా ఉండుడి" (మత్త 24:44).

"అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించిపోవును, పంచ భూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమై పోవును, భూమియు దాని మీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమై పోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు, పంచభూతములు మహా వేండ్రముతో కరిగిపోవునట్టియు, దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను" (2 పేతు 3:10, 11).

"యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును నీ యొద్దకు పంపబడిన వారిని రాళ్లతో కొట్టుచును ఉండుదానా, కోడి

తన పిల్లలను రెక్కలక్రింది కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేను నీ పిల్లలను ఎన్నో మారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లకపోతిరి" (మత్త 23:37).

"అప్పుడు ఆత్మ ఫిలిప్పుతో - నీవు ఆ రథము దగ్గరకు పోయి దానిని కలిసికొనుమని చెప్పెను. ఫిలిప్పు దగ్గరకు పరుగెత్తికొనిపోయి అతడు ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండగా విని - నీవు చదువునది గ్రహించుచున్నావా? అని అడుగగా, అతడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి, రథమెక్కి తనతో కూర్చుండుమని ఫిలిప్పును వేడుకొనెను. అతడు లేఖనమందు చదువుచున్న భాగమేదనగా - ఆయన గొఱ్ఱెవలె వధకు తేబడెను. బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెపిల్ల ఏలాగు మౌనముగా ఉండునో ఆలాగే ఆయన నోరు తెరువకుండెను. ఆయన దీనత్వమును బట్టి ఆయనకు న్యాయ విమర్శ దొరకక పోయెను. ఆయన సంతానము ఎవరు వివరింతురు? ఆయన జీవము భూమిమీదనుండి తీసివేయబడినది. అప్పుడు నపుంసకుడు-ప్రవక్త యెవనిని గూర్చి ఈలాగు చెప్పుచున్నాడు? తన్ను గూర్చియా, వేరొకని గూర్చియా? దయచేసి నాకు తెలుపుమని ఫిలిప్పు నడిగెను. అందుకు ఫిలిప్పు నోరుతెరచి, ఆ లేఖనము ననుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను. వారు త్రోవలో వెళ్లుచుండగా నీళ్లున్న ఒక చోటుకు వచ్చినప్పుడు నపుంసకుడు - ఇదిగో నీళ్లు నాకు బాప్తిస్మ మిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్లలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చెను" (అపొ.కా. 8:29-38).

"గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను" (అ. కా. 22:16).

(సమాప్తం)

# క్రియలు లేని విశ్వాసము మృతము

## ( Faith without works is Dead )

మానవ హృదయంలో సజీవమైన విశ్వాసం చోటు చేసుకొని యుంటే అది దేవుని చిత్తానికి విధేయత చూపుచు ఎల్లప్పుడు ప్రత్యక్ష మవుతాది. ఒకడు జీవము గల విశ్వాసాన్ని కలిగి యుంటూ అవిధే యతగల జీవితాన్ని జీవించడం అసంభవం. లేదా అవిధేయుడగుచూ విశ్వాస సంబంధమైన జీవితం జీవించడం అసంభవం. యిది బైబిలు బోధించుచున్న నిగూఢ సత్యం.

"అయితే ఒకడు - నీకు విశ్వాసమున్నది, నాకు క్రియలున్నవి, క్రియలు లేకుండ నీ విశ్వాసము నాకు కనపరచుము, నేను నా క్రియల చేత నా విశ్వాసము నీకు కనపరతునని చెప్పును" (యాకోబు 2:18). "మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రము కాక క్రియల మూలము నను నీతిమంతుడని యెంచబడును". "ప్రాణములేని శరీర మేలాగు మృతమో ఆలాగే క్రియలులేని విశ్వాసము మృతము" (యాకోబు 2 : 24, 26).

ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసమే రక్షించునట్టి విశ్వా సము (గలతీ 5:6). మరియు "మన మాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (1 యోహా 5:3) క్రీస్తు సువార్తకు లోబడనివారు నిత్య నాశనమునకు పోవుదురు (2 థెస్స 1:7-9). "జీవ వృక్షమునకు హక్కు గలవారై గుమ్మముల గుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకు కొనువారు ధన్యులు" (ప్రక 22 : 14). విశ్వాసముద్వారా రక్షింప బడుటకు ఏమి చేయాలో తెలిసికోవాలంటే, ఈ లేఖనములను చదు వుము : మార్కు 16 : 16; అపొ. కా. 2 : 38; 8 : 26-40; 2 పేతురు 1 : 5-11.

★

## సంక్షిప్త వార్తలు

సోదరులు నెహెమ్యా గూటంగారు గత జనవరిలో అమెరికా వెళ్ళి తన పర్యటనను జయప్రదంగా ముగించుకొని ఏప్రియల్ 5వ తేదీనాడు కాకినాడకు చేరుకొన్నారు. మద్రాసు నుండి కాకినాడ వరకు రైలులో ప్రయాణంచేసి ఆయన సరాసరి ఆదివారపు ఆరాధనకు హాజరయ్యారు. అమెరికాలో ఆయన పలు రాష్ట్రాలలో పర్యటించి అనేక క్రీస్తు సంఘములలో ప్రసంగించారు.

ఈ సంచిక ముద్రించు సమయానికి సోదరులు జాషువా గూటం గారు సతీ సమేతంగా ఒక నెలపాటు అమెరికా వెళ్ళే ఏర్పాటులలో యున్నారు. ఆయన ఏప్రియల్ 27వ తేదీనాడు రేటవున్ చేరుకోగలరు. జాషువా గూటం దంపతుల రాకపోకల విషయమై మీ ప్రార్థనలలో గుర్తుంచుకొన మనవి. ★

---

Regd. No. H/KD—45/KD H.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To